
జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 29 ఏప్రిల్ 2024 www.ntnews.com


## పూడిక తీత

కథాసుధ

**వేసవి** కాలంలో ఓ ఊళ్లోని గుడి దగ్గర కోలాహలంగా ఉంది. ఎందుకంటే కొందరు కళాకారులు అక్కడ రెండువారాల పాటు మహాభారతంలోని పర్వాలన్నిటినీ వీధి నాటక రూపంలో ప్రదర్శించే వారు. గ్రామస్తులు సాయంకాలానికి పనులన్నీ ముగించుకుని గుడి దగ్గరికి వెళ్లి శ్రద్ధగా నాటకాలు చూసేవారు. సమీపంలోని గ్రామవాసులు కూడా నాటకాలు చూసేందుకు తరలి వచ్చేవారు. ద్రౌపది వస్త్రాపహరణం, బకాసుర వధ, శ్రీకృష్ణ రాయబారం, దుర్యోధన వధ లాంటి ఘట్టాలను ప్రదర్శించే రోజుల్లో జనం కిక్కిరిసిపోయేవారు. ఒకరోజు గ్రామపెద్ద వీధి నాటకాన్ని చూడటానికి బయల్దేరుతుండగా ఓ రైతు పొలంలో ఉండటాన్ని గమనించాడు. 'నాటకాలు చక్కగా జరుగుతున్నాయి. వచ్చి చూడరాదా!' అని రైతును ఆహ్వానించాడు గ్రామపెద్ద. 'అయ్యా! గతేడాది చూశాను. మహాభారతం నాటకాన్ని ఎన్నిసార్లు చూసినా ఒకటే కదా. కొత్తగా ఏముంటుంది చూడటానికి' అన్నాడు రైతు. గ్రామపెద్ద నవ్వి 'పొలంలోని బావిలో నీళ్లు ఇంకిపోతే ఏం చేస్తావు?' అని అడిగాడు. 'పూడిక తీయిస్తాను. అప్పుడు కొత్త నీళ్లు వస్తాయి. చాలా తేటగాను, రుచిగానూ ఉంటాయ'ని బదులిచ్చాడు రైతు. 'మళ్లీ ఎండిపోతే' అన్నాడు గ్రామపెద్ద. 'మళ్లీ పూడిక తీయించక తప్పదు కదా బాబూ' అన్నాడు రైతు. 'మహాభారతం ఎన్నిసార్లు విన్నా, చదివినా, ఆ నాటకాలను అనేకసార్లు చూసినా మనకు కొత్తగా ఎన్నో మంచి విషయాలు తెలు



స్తాయి. బావిలోని అడ్డును పూడికతీత ద్వారా తొలగించినట్లు, భారతాన్ని మళ్లీ మళ్లీ వింటే అది మన మనసులోని అనేక అడ్డుపొరలను తొలగిస్తుంది. పూడిక తీసిన బావిలో వచ్చే తేటనీళ్లలా మన మనసు స్వచ్ఛంగా తయారవుతుంది. జీవన పోరాటంలో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుకునే శక్తి మనకు లభిస్తుంది' అని చెప్పి గ్రామపెద్ద అక్కడి నుంచి బయల్దేరాడు. అతని వెనుకే రైతు కూడా భారత నాటకం చూడటానికి బయల్దేరుతాడు.

... ✍ ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

# సమస్యా పరిష్కారమూ నీదే..

గీతావాక్యం

**న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ।**
**కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా॥**

(భగవద్గీత 1-32)

**ఈ** ప్రపంచంలోని ప్రతి వ్యక్తి కోరుకునేది ఆనందాన్నే. అయితే ఆ ఆనందం అందరూ అనుభవించగలుగుతున్నారా? లేదు అనుకుంటే.. కారణం ఏమిటి? అంటే తాను 'కోరిన' ఆనందం వేరు.. తనకు 'అవసరమైన' ఆనందం వేరు. ఈ రెండిటి మధ్య భేదాన్ని గుర్తించలేని మానసిక స్థితి కలిగిన మానవుడు.. ఎంత సాధించినా అసంతృప్తితో రగిలిపోతూ కర్తవ్యాన్ని విస్మరిస్తాడు.

ప్రతి వ్యక్తి జీవితానికి ఒక ప్రయోజనం ఉంటుంది.. అలాగే కొన్ని ఇష్టాయిష్టాలు ఉంటాయి. దేనికోసం దేనిని వదులుకోవాలో తెలుసుకోవడమే జ్ఞానం.. అదే విజ్ఞత. అదే మన లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది. సాధారణ వ్యక్తికి ఇందులో దేనిని ఆదరించాలనే సమస్య



వస్తుంది. సమస్య తనది కాబట్టి తానే పరిష్కార మార్గాన్ని అన్వేషించాలనీ, ఆ పరిష్కారమూ తనయందే ఉన్నదని గ్రహించగలిగిన వారు అన్వేషకులు. వాళ్లే సాధకులు. నిజానికి అదే సమస్యా పరిష్కారానికి మొదటి మెట్టు.

మహాభారత యుద్ధరంగంలో ఉభయ సైన్యాలలో ఉన్న తన చుట్టాలు, గురువులు, మిత్రులను చూడగానే అర్జునునికి జాలి కలిగింది. ఆత్మీయులైన వీరితోనా తాను యుద్ధం చేయాలి. వైరిబలాలలో ఉన్న తన వారిని తాను సంహరించినా.. వైరివర్గం వారు తన పక్షంలోని వారిని సంహరించినా.. తనకు మిగిలేది దుఃఖమే కదా! ఈ స్వజన సంహారంతో లభించే సామ్రాజ్యం తనకు సంతోషాన్ని ఇస్తుందా? భౌతిక సంపదను పొందడానికి చేసే స్వజన సంహారం అన్యాయం కాదా? బంధుమిత్రులను చంపి తాను తినే నెత్తుటికూడు ప్రశాంతతను ఇస్తుందా? పరిణామాలు తెలిసీ హింసాత్మకమైన యుద్ధ మార్గంలో నడవడం కన్నా అడవులలో కందమూలాలు తింటూ.. తపస్సు చేసుకోవడం ఉత్తమ మానవ ధర్మం కాదా? ఇది కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునునికి ఎదురైన సమస్య. దాని పరిష్కారానికి తన సామర్థ్యం సరిపోదని గ్రహించిన అర్జునుడు తాను నమ్మి, నారాయణునిగా భావించిన కృష్ణుడి సాయం కోరాడు.

యుద్ధంలో తనవారు చనిపోతారనే భావన వల్ల కలిగిన జాలి వారిని చిరకాలం బ్రతికిస్తుందా? లేదు! మరి ఆ జాలికి కారణం? మృత్యుభీతి. నిజానికి చేసే పనిలో ఆనందాన్ని పొందని వ్యక్తిలో అనేక సంశయాలు వెలుగుచూస్తాయి. తాను చేస్తున్న పని పవిత్రమైనదనీ, తాను ఆ కార్య నిర్వహణలో ఉపకరణం మాత్రమే తప్ప కర్తను కాననీ, త్రికరణశుద్ధిగా నమ్మి ఆ పనిని ఉపాసనగా భావించి ఆచరించే వ్యక్తి ఆ పనిలో భగవంతుడిని దర్శిస్తాడు. దానినే 'రసోవైసహ' అన్నారు పెద్దలు. బాధపడటం వల్ల సమస్య పరిష్కారం కాదు. బాధ అనేది ఒక ఊగే కుర్చీ లాంటిది. అది నిరంతరం తీరికలేకుండా చేస్తుందేకాని ఒక అంగుళం కూడా ముందుకు కదిలించదు.

ఆ సమయంలో కృష్ణుడు... 'అర్జునా! నీవు సమస్యలోని బాహ్యాపార్శ్వాన్నే చూస్తున్నావే కాని.. అంతరంగంలోకి చూడటం లేదు. ఆంతర్యాన్ని గ్రహించు నీ సందేహాలు తీరిపోతాయి' అన్నాడు. నిజానికి అర్జునుడి సందేహం మనందరిది కూడా. భగవంతుడు ఉపదేశించిన గీతలో చూడాల్సింది పదాలను కాదు.. వాటి వెనుక దాగిన రహస్యాన్ని. సమస్యలను ఎదిరించి పరిష్కరించుకోవాలే కాని... పారిపోవడం సమంజసం కాదు. సమస్యల నుంచి సమస్యలను సృష్టించుకోవడం కాదు.. సమస్యలలో సమరసతను చూడటం అలవర్చుకోవాలి. అలా ఆలోచించగలిగిన వారిలో జాత్యంతరీకరణ జరుగుతుంది. వారే విజయ సాధకులుగా నిలుస్తారు. అదే గీతాబోధనకు అంతిమ ఫలితం.


... ✍ పాలకుర్తి రామమూర్తి

## గ్రహణ సందేశం

**సూర్యుడి** కుటుంబంలో బుధుడు, శుక్రుడు మినహా మిగిలిన అన్ని గ్రహాలకూ ఉపగ్రహాలు ఉన్నాయి. భూమికి– చంద్రుడు, అంగారకుడికి– ఫాబోస్, డైమోస్, ఇక బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలకు చాలా ఉపగ్రహాలు ఉన్నాయి. గ్రహాలు సూర్యుడి చుట్టూ తిరిగితే, ఉపగ్రహాలు గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. ఈ విధమైన ఏర్పాటు కారణంగా సూర్యుడికి, సంబంధిత గ్రహానికి మధ్య ఉపగ్రహం వచ్చే పరిస్థితులు ఏర్పడతాయి. భూమి విషయంలో... సూర్యుడికి భూమికి మధ్య చంద్రుడు వస్తాడు. ఇది అమావాస్య రోజుల్లో జరుగుతుంది. ఈ సమయంలో సూర్యుడు పాక్షికంగానో, పూర్తిగానో కనిపించడు. ఈ ఖగోళ అద్భుతాన్ని సూర్య గ్రహణం అని పిలుస్తారు. ఇక సూర్యుడు– చంద్రుడికి మధ్య భూమి రావడం వల్ల మనకు చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. మరో కోణంలో చూస్తే... ఇది చంద్రుడికి సూర్యగ్రహణం అవుతుంది. గ్రహణాలు భూమ్మీద వచ్చినా, ఇతర గ్రహాల మీద వచ్చినా... మనిషి ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా సత్యాన్వేషణలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతా యనే సందేశం వీటిలో ఇమిడి ఉంటుంది.



అవాంతరాలు ఎదురైనా అవి తాత్కాలికమే... సత్యం నిత్యంగా వెలుగుతూ ఉంటుందని గ్రహణాలు మనకు తెలియజేస్తాయి. కాబట్టి, సత్యాన్ని తెలుసుకునే క్రమంలో మనం సహనంతో, అచంచలమైన విశ్వాసంతో ఉంటే ఆటంకాలు వాటంతట అవే పక్కకు తొలగిపోతాయి. ఇదే గ్రహణ సందేశం.



**లీలామానుష విగ్రహుడైన గోపాల కృష్ణుని బాల్యలీలలలో ఐశ్వర్య మాధుర్య శక్తుల మేలు కలయిక అయిన 'ఉలూఖల బంధన' (దామోదర) లీల తాత్త్వికంగా చాలా కీలకమైనది. శ్రీ శుక ఉవాచ.. రాజా! ఎలాగైతేనేమి, నందబాల యశోద వసుదేవ నందనుణ్ని పట్టుకొన్నది. పట్టుకొన్నదే కాని, అతనిని కొట్టడానికి ఆమెకు చేతులు రాలేదు. కుసుమ కోమలమైన మేను, మనసూ కల యశోద పసివాని మీద జాలిపడి, పోనీలే- కొట్టకుండా కట్టివేద్దామని తలచింది.**

❖ ❖ ❖

**వెన్న దొంగిలించి పారిపోతూ యశోద చేతికి చిక్కిన చిన్నికృష్ణుని వన్నెచిన్నెలను పోతన తనవైన ఎన్నో పద్యాలలో ఘనంగా వర్ణించాడు. 'పుష్టి భక్తి'కి ప్రతీక అయిన యశోద నోట అప్రయత్నంగా అధోక్షజుని- విష్ణుని అసలు తత్త్వాన్ని- జ్ఞానాన్ని భక్తిరసంతో రంగరించి హృదయంగమంగా విశదపరిచాడు. 'నే పలికిన భవహర మగునట' అన్న తన మాట నీటి మూట కాదని తేటపరుస్తూ పలికించాడు.**


# బొజ్జ దిరిగి రాదయ్యె!..

**కం॥ 'పట్టినఁ బట్టువడని నినుఁ**
**బట్టెదనని చలముఁ గొనినఁ బట్టుట బెట్టే?**
**పట్టువడవంద్రు పట్టీ!**
**పట్టుకొనన్ నాకుఁగాక పరులకు వశమే?'**

యశోద ఇలా అన్నది... 'పట్టీ! (బిడ్డా) నన్ను ఎవరూ పట్టుకోలేరని నువ్వు అనుకుంటున్నావు. నీవు అంత తేలికగా పట్టుబడేవాడవు కావని ఇతరులందరూ కూడా అంటారు. కాని, పట్టాలని పట్టుదల ఉన్నా నిన్ను పట్టడం పెద్ద రట్టు (కష్టం) అనుకున్నావా? చిన్నా! నిన్ను పట్టుకోవడం నాకు కాక పరులకు సాధ్యమవుతుందా?

**కం॥ 'ఎక్కడనైనను దిరిగెద**
**వొక్కయెడన్ గుణము కలిగి యుండవు, నియమం**
**బెక్కడిది నీకు మరచినఁ**
**జక్కగఁ బోయెదవు పెక్కు జాడలఁ బుత్రా'**

'నాన్నా! నువ్వు బెదురులేక ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ ఎదురుపడుతూ ఉంటావు. ఒక్క చోట కుదురుగా చక్కగా బుద్ధి- మంచిగుణం కలిగి ఉండవు. నీ ప్రవర్తనకు ఒక పద్ధతి అంటూ లేకుండా పోయిందేమిరా? క్షణ కాలం విస్మరిస్తే- ఏమరుపాటు చెందితే అందరినీ పామరులు (అజ్ఞులు)గా చేసి విలక్షణమైన వేషాలు- ఎన్నైనా వేస్తావు'.




విష్ణువు 'ఇందుగలడందు లేడని సందేహం'లేని సర్వాంతర్యామి. అన్ని రూపాలూ తన రూపమే అయినవాడు. 'వొక్కయెడన్... యుండవు'- ఎందుకని? త్రిగుణాలకు అతీతుడు కనుక. సర్వతంత్ర స్వతంత్రునికి, సర్వనియంతకు, అఖిల శక్తిధరునికి నియమ నిబంధనలు పెట్టడం ఎవరికి సాధ్యం? జీవులందరూ పరతంత్రులేగా! 'సర్వము తానైనవాడు' అన్న స్ఫురణ- ఎరుక, ఒక్క క్షణమైనా లేకపోతే, తాను 'ఏకమేవ అద్వితీయం' అయి కూడా తనను 'నానా' (అనేకం)గా- అయినవాడు (మిత్రుడు) గానూ, కానివాడు (శత్రువు) గానూ కనుకట్టు (గారడి) చేసి తోపింపజేస్తాడు.

**సీ॥ 'తోయంబులివి యని తొలఁగకచొచ్చెదు**
**తలఁచెదు గట్టినఁ దరల నెత్త**
**మంటితో నాటలు మానవు, కోరాడె,**
**దున్నత స్తంభంబు లూఁపఁబోయె**
**దన్యుల నల్పంబు లడుగంగఁ బారెదు**
**రాచ వేటలఁ జాలరవ్వ దెచ్చె**
**దలయవు నీళ్లకు నడ్డంబుఁ గట్టెదు**
**ముసలివై హలివృత్తి మొనయఁ జూచె'**
**ఆ॥ 'దంబరంబు మొలకు నడగవు దిరిగెద**
**వింకఁగల్కి చేతలేల పుత్ర**
**నిన్ను వంప వ్రాల్ప నేనేర ననియొ నీ**
**విట్టు క్రిందు మీదు నెరుఁగకునికి'**

ఈ సీస పద్యంలో యశోద తనకు వీసమంత కూడా ధ్యాస లేకుండానే దశనామాల ఊసు (ప్రస్తావన, కథనం) ఎత్తకుండా వాసుదేవ కృష్ణుని భాసురమైన దశావతారాలను 'వ్యాజస్తుతి'- నిందాస్తుతి రూపంగా అగ్గలం- గొప్పగా ఉగ్గడిం (అభివర్ణిం)చింది.

'ఒరే కన్నయ్యా! ఉరు (మిక్కిలి) ప్రమాద భరితమైన అగాధ పయోధి (సముద్ర) జలప్రవేశం నీకెంతో ప్రమోద (ఆనంద) దాయకం రా! (మత్స్యావారంలో మహోదధి జొచ్చి సోమకాసురుని వ్రచ్చి, వాడు ముచ్చిలి (దొంగలించి)న వేదాలను విధాత- బ్రహ్మదేవునకు తెచ్చి ఇచ్చావు). ఎంత పెద్ద పర్వతాన్నైనా పైకెత్తే ప్రయత్నం చేస్తావు (కూర్మావతారంలో బృందారక (దేవతా) బృందంపై కూరిమి- ప్రేమతో మందరగిరిని ఎత్తి, ఒరిమితో దానికి కుదురుగా నిలిపి, అమరులకు అమృతం పంచి, అయోగ్యులైన అసురులను వంచించావు). మట్టిలో ఆటలు మానక పొర్లాడతావు. ముట్టె (నోటి)తో ఎగజిమ్మి, ఎత్తి నెత్తిన పోసుకుంటావు (ఆది వరాహావతారం ధరించి, భూదేవిని ఉద్ధరించి, కోరలపై నిలిపి, వ్రీడ (సిగ్గు) పడుతున్న ఆమెతో ఓర చూపులతో చిలిపిగా క్రీడించావు). ఉన్నతమైన స్తంభాలను సైతం జంభం (దర్పం)తో ఊపుతూ ఛిన్నాభిన్నం చేయడానికి పూనుకుంటావు (నృసింహావతారంలో స్తంభం నుంచి సంభవించి దంభపూరితుడైన హిరణ్యకశిపుని సంహరించి, పసివాని- బాలప్రహ్లాదుని ఖేదాన్ని పరిహరించావు). నీవు అనల్పుడవైనా స్వల్పమైన వస్తువుల కొరకు పరాయి వారి వద్దకు పరుగులెత్తి చేయి చాచుతావు (వామనావతారంలో ఆఖండలు- ఇంద్రుని కొరకు బలిని మూడడుగుల స్థలి (భూమి) అర్థించి, అవామనుడ- త్రివిక్రముడవై లోకత్రయాన్ని అలవోకగా ఆక్రమించావు). రాజస ప్రవృత్తికి లోనై రాజులను వేటాడి అపకీర్తి మూటగట్టుకొన్నావు (పరశురామ అవతారంలో ఆగడాలు చేస్తున్న క్షత్రియాధములను కక్షపూని వేటాడి- శిక్షించి జగడాలు కొనితెచ్చుకున్నావు). జల ప్రవాహానికి అవలీలగా అడ్డుకట్ట వేయాలని ఆలోచిస్తావు (రామావతారంలో లేమ (సీత) కొరకై సముద్రంపై సేతువు నిర్మించావు). రోకలి వంటి దండాన్ని, నాగలిని చేత పట్టి మట్టి దున్నుట మొదలగు సేద్యపు పనులు చేయ పూనుచున్నావు (బలరాముడవై ముసలం (రోకలి), హలం (నాగలి) ఆయుధాలుగా ధరించి అనాదిగా భారతదేశపు ప్రధాన వృత్తి అయిన వ్యవసాయానికి ప్రతీకగా నిలిచావు. ప్రలంబాది అసురులను సంహరించావు). దిసమొలతో తిరుగుతావు (బుద్ధావతారంలో దిగంబరివై తిరుగ గలవు) ఇంకనూ కలికి- నేర్పరి తనపు (చాతుర్యపు) పనులెందుకు? (కల్కిగా అవతరించాల్సిన అవసరమేమి?) శ్యామలాంగా! నిన్ను లొంగదీయడంలో నాకు భంగపాటు తప్పదనేగా నీ ధైర్యం? ఈ వీరంగం- కదం తొక్కడం? అందుకే నీవు కిందు మీదు కానక మిడిసిపడుతున్నావు.

**కం॥ 'ఆ లలన గట్టె రోలన్**
**లీలన్ నవనీత చౌర్యలీలుం బ్రియవా**
**గ్జాలుం బరివిస్మిత గో**
**పాలున్ ముక్తాలలామ ఫాలున్ బాలున్'**

శుకయోగి.. రాజా! అలా పలుకుచూ ఆ లలన యశోద ఉపేంద్రుని (విష్ణుని) అవతార రహస్యాలు ఉపాలంభం చేస్తూ- ఎత్తిపొడుస్తూ, నవనీత చౌర్యమే లీల (పని)గా కలవాడు, ఇంపైన మాటలు వినసొంపుగా గలగలా మాట్లాడువాడు ఫాల భాగాన- నొసటన ముక్తాలలామ (ముత్యపుబొట్టు) అలరారు- శోభించువాడు అయిన ఆ మేటి అల్లరి బాలుని, గొల్లలందరూ ముక్కున వేలేసుకొని నిక్కి నిక్కి చూస్తుండగా ఆ బోటి- నంద స్త్రీ, రోటికి కట్టుటకై తాళ్లతో పోటీ పడటానికి పూనుకుంది.'

రాజా! అవ్యక్తుడు- ఇంద్రియాలకు గోచరించని వాడు, అసంగుడు- దేనిచే కూడా అంటుపడని వాడు, మానవ లక్షణాలతో మనసు హరించే మాధవుని- కృష్ణుని విష్ణువని తెలియలేని యశోద తన ఆత్మజుని- సుతునిగా తలచి, ప్రాకృతుని- కేవలం మనుష్య బాలుని వలె బంధించింది. తన యుణ్ని రోటికి కట్టడానికి అతని నడుము చుట్టూ నిడుపాటి తాడు చుట్టింది. ఆశ్చర్యకరంగా ముడి వేయడానికి రెండు అంగుళాలు తగ్గింది. వింతబోయి ఆ కాంత దానికి మరోతాడు సంధించగా బంధనానికి మరల అంతే- రెండు అంగుళాలే కొరంత (తక్కువ) పడ్డది.




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

**కం॥ 'తజ్జనని లోగిటం గల**
**రజ్జు పరంపరలఁ గ్రమ్మరన్ సుతుఁగట్టన్**
**బొజ్జ దిరిగి రాదయ్యె జ**
**గజ్జాలములున్న బొజ్జఁగట్టన్ వశమే?'**

'సుతుని కట్టడానికి ఆ సుదతి ఇంటిలోని అన్ని తాళ్లూ వరుసగా ముడివేసినా అంతే వెలితి ఉండిపోయింది. ముజ్జగాలూ దాగి ఉన్న ఆ రుచిరమైన (అందమైన) చిరుబొజ్జను రజ్జువులతో కట్టడం ఎవరికి సాధ్యం?'. తన అల్లరి పిల్లవాని వలన గొల్లపల్లెకు కలుగుతున్న గోస (కలత, బాధ)కు తల్లడిల్లుతున్న ఆ తల్లి ఆ గోకుల బాధను తొలగించబోయి ముల్లోకాలనూ కల్లోల పరచిందని అంటాడు లీలా శుకుడు.

(సశేషం)

# శ్రమను గుర్తిస్తే..




'మజ్దూర్, కూలీ.. ఇలా ఏ పేరుతో పిలిచినా మనకు సాయపడేవారు ఎవరైనా మీ సోదరులు' అని చెప్పారు ముహమ్మద్ ప్రవక్త (స). సమాజంలో ఎవరూ ఎక్కువా తక్కువా కాదు. ఒకరినొకరు పరస్పరం సాయం అందించుకునేందుకే జాతులుగా, తెగలుగా విభజన జరిగిందని ఖురాన్ చెబుతుంది. ఎవరినైనా తమ దగ్గర పనిలో పెట్టుకుంటే వారి వేతనాన్ని చెల్లించాలన్నది ఇస్లాం బోధనల సారాంశం. వారికి చెందాల్సిన హక్కును వారికి అందించాలి. 'కూలీవాని చెమట చుక్కలు ఆరకముందే అతని కష్టార్జితాన్ని ఇచ్చేయాలి' అన్న ప్రవక్త ఉద్బోధ కష్టజీవుల కష్టార్జితం దోచుకోకూడదని చెబుతుంది. ఎవరైనా తమ వద్ద పనిచేసే కూలీవాని వేతనాన్ని ఎగ్గొట్టిన వ్యక్తికి అంతిమ దినాన కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు ప్రవక్త (స).

**ప్రవక్త** బోధనల గ్రంథంలోని ఓ గాథ కూలీల శ్రమకు ఎంతటి విలువ ఇవ్వాలో చాటిచెబుతుంది. పూర్వం ఒక వ్యక్తి దగ్గర ఓ కూలీ పనిచేసేవాడు. ఏ రోజు కూలీ డబ్బులు ఆరోజు తీసుకుని వెళ్లేవాడు. అయితే ఒకరోజు రోజంతా పనిచేసి తీరా కూలీ డబ్బులు ఇచ్చే సమయానికి అతను కానరాలేదు. ఆ యజమాని అతని కూలీ డబ్బులను కొన్ని రోజుల వరకూ భద్రంగా ఉంచాడు. ఎంతకూ ఆ కూలీ రాకపోయేసరికి ఆ డబ్బును తన వ్యవసాయంలో పెట్టుబడిగా పెట్టాడు. అతని వాటాకింద వచ్చిన లాభాలను మళ్లీ పెట్టుబడిగా పెట్టసాగాడు. అందులోంచి ఒక్క రూపాయి కూడా తన సొంతానికి వాడేవాడు కాదు. కొన్నేండ్లు గడిచిపోయాయి. ఒకరోజు ఆ కూలీవాడు యజమానికి తారసపడ్డాడు. గతంలో మరచిపోయిన కూలీ డబ్బులు చెల్లించమని అడిగాడు. అప్పుడు ఆ యజమాని 'అదిగో ఆ పొలం నీదే, ఈ మేకలు, ఈ ధాన్య రాశులు నీవే' అని చెప్పడంతో ఆ కూలీవాడు ఖంగుతిన్నాడు. యజమాని చెప్పేది నమ్మలేకపోయాడు. తనను అపహాస్యం చేస్తున్నాడని తలపోశాడు. కూలీ డబ్బులు ఇచ్చేస్తే వెళ్లిపోతానని బతిమాలాడు. యజమాని అసలు విషయాన్ని పూసగుచ్చినట్లు వివరిస్తే కూలీవాడు ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

ఒకసారి హసన్ బస్రీ (రహ్మలై) దగ్గరికి ఒక యువకుడు వచ్చాడు. 'ఈ రోజు నుంచి నేను ఎలాంటి పనిచేయను, సంపాదించను' అని చెప్పాడు. హసన్ బస్రీ (రహ్మలై) ఎందుకని అడిగారు. దానికా యువకుడు 'నేను ఈ రోజు అడవిలో ఒక వింత సంఘటన చూశాను. ఒక పులి ఒక జంతువుపై పంజా విసిరింది. తనకు కావాల్సింది తిన్నది. మిగతాది పర్వతంపై ఒక నడవలేని ఓ గుడ్డి తోడేలుకు అందించింది. అడవిలోని తోడేలు కడుపునింపే ఆ అల్లాహ్ నా ఆకలి తీర్చడా. అందుకే ఈ రోజు నుంచీ ఏ పని చేయను' అని వివరణ ఇచ్చాడు. హసన్ బస్రీ (రహ్మలై) కలగజేసుకుని 'నీకు పులిగా మారాలని లేదా? తోడేలుగా మారాలనుకుంటున్నావా?' అని ఎదురు ప్రశ్నించారు. మజ్దూర్లు ఎప్పటికీ తోడేళ్లు కారు. కూలీ పనిచేసేవాళ్లు పులులు' అని ప్రశంసించారు హసన్ బస్రీ (రహ్మలై). అందుకే కూలీలు తలఎత్తుకు తిరగాలి. ప్రవక్తలు, ఖలీఫాలు కూలీ పనులు చేసుకుని ఉపాధి పొందేవారు. ఖలీఫా అబూబకర్ (రజి) చక్రవర్తిగా తాను కూలీవాని కంటే ఎక్కువ జీతాన్ని తీసుకునే వారు కాదు. మన దగ్గర పనిచేసే వారికి మనం తిన్నదే ఆహారంగా ఇచ్చి గౌరవించాలని ప్రవక్త (స) ఉద్బోధ. కార్మికుల స్వేదాన్ని గౌరవించడం యజమాని బాధ్యత. వారి కష్టానికి తగిన వేతనం ఇవ్వడం ధార్మిక విధి.

... ✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076